ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

సోమవారం 11 మార్చి 2024



ఏడుపాయలలో రథం లాగుతున్న భక్తులు



రథం ఎదుట పెద్ద పట్నం వేస్తున్న వృత్తి పనివారు

అంగరంగ వైభవంగా..

ఏడుపాయలలో వనదుర్గామాత రథోత్సవం

- రథాన్ని లాగడానికి పోటీపడిన భక్తులు
- పెద్దపట్నం వేసి.. అన్నాన్ని రాశిగా పోసి పూజలు

పాపన్నపేట, మార్చి 10: ఏడుపాయల జాతరలో చివరి అంకమైన రథోత్సవం ఆదివారం రాత్రి ఉత్సాహంగా సాగింది. ఏడుపాయల ధర్మకర్త రాగి చక్రపాణి తయారు చేయించిన కొత్త రథాన్ని రంగుల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆనవాయితీ ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిరెడ్డి ఇంటికి వెళ్లి రథోత్సవానికి ఆహ్వానం పలికారు. నాగ్సాన్‌పల్లికి చెందిన 18 రకాల వృత్తుల వారు ఏడుపాయలకు వచ్చి, రథం ఎదుట పెద్దపట్నం వేసి అన్నాన్ని రాశిగాపోసి గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గర్భగుడిలో నుంచి వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు వనదుర్గామాత నామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. దుర్గమ్మ నామస్మరణతో ఏడుపాయల అటవీ ప్రాంతం ప్రతిధ్వనించింది.

పోటెత్తిన భక్తజనం

జాతర రథోత్సవం, ఆదివారం కలిసిరావడంతో ఏడుపాయల క్షేత్రం కిటకిటలాడింది. లక్షకు పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి గంటల తరబడి భక్తులు క్యూలైన్లలో వేచిఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. రోజంతా అమ్మవారికి మొక్కులు చెల్లించే భక్తుల బోనాల ఊరేగింపులు, శివసత్తుల పూనకాలు, ఒడిబియ్యం, తలనీలాల సమర్పణతో సందడిగా సాగింది. వందల పొట్టేళ్లను, కోళ్లను సమర్పించి విందులు చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో ఏ చోట చూసినా గుడారాలు వేసుకుని భక్తులు సేదతీరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్ ఆధ్వర్యంలో 700 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పాలకమండలి ఛైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ధర్మకర్తలు రథోత్సవ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. జాతరలో పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. బండ్ల ఊరేగింపు రోజు వేర్వేరు కారణాలతో అస్వస్థతకు లోనైన పలువురిని ప్రథమ చికిత్స అందించిన వైద్య సిబ్బంది 108 వాహనంలో చికిత్స కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నిశాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బిత్తిరి సత్తి ప్రదర్శన ఆకట్టుకుంది.





ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆట.. నవ్వులాట..!

- క్రీడా ప్రాంగణాల నిర్వహణ శూన్యం
- నిరుపయోగంగా మారిన పరికరాలు

సంగారెడ్డి టౌన్, మార్చి 10 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలనే ప్రధాన లక్ష్యంతో గత ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేసింది. సదుద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కొన్ని మైదానాలు ఆటలకు అనువుగా లేకపోవడంతో నిర్దేశించిన లక్ష్యం నెరవేరడంలేదు. మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడామైదానాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, యువకులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

జిల్లాలో 743 చోట్ల క్రీడామైదానాలు

సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, 96 మదిర గ్రామాలు ఉన్నాయి. వీటిన్నింటిలో కలిపి జిల్లా వ్యాప్తంగా 743 క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంతాన్ని బట్టి అర ఎకరం నుంచి మూడెకరాల వరకు ప్రభుత్వ భూమి ఎంపిక చేసింది. జిల్లాలోని 743 క్రీడా మైదానాలకు ఉపాధి హామీ పథకం కింద రూ.20.50 కోట్లతో మైదానాల్లో అవసరమైన ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్ తదితర కోర్టులతో పాటు బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఉద్ధేశంతో కొన్నిచోట్ల రాళ్ల రప్పలు చదునుగా లేని భూములను కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ. 3.71 కోట్ల క్రీడా పరికరాలు

క్రీడామైదానాలను 2022లో ఏర్పాటు చేయగా.. ఆడుకునేందుకు అవసరమైన క్రీడా పరికరాలను 2023 ఆగస్టులో ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి అందజేసింది. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం 23 రకాల ఆట పరికరాలతో కూడిన కిట్లను అందజేసింది. ఒక్కో కిట్ విలువ రూ. 50 వేలు కాగా ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా రూ. 3.71 కోట్ల విలువైన ఆట పరికరాలను పంపిణీ చేశారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్. షటిల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పరికరాల కిట్లను అందజేశారు. 2023 అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని తెలియడంతో అంతకుముందే ఆదరాబాదరగా క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. కొన్నిచోట్ల పంపిణీకి నోచుకోకపోవడంతో క్రీడా కిట్లు ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో పడిఉన్నాయి. నిర్వహణ లేక జిల్లాలో చాలాచోట్ల క్రీడా మైదానాలు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. వాటిలో ఏర్పాటు చేసిన పరికరాలు శిథిలమవుతున్నాయి. ప్రభుత్వం మారినప్పటికీ.. ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొండాపూర్ మండలం గొల్లపల్లిలో నిరుపయోగంగా ఉన్న క్రీడాప్రాంగణం



కోహీర్ మండలంలోని పీచేరాగడి తండాలో వెలవెలబోతున్న క్రీడాప్రాంగణం

నాటుకు నీరందేనా?

మెతుకు సీమలో వరి సాగుకే రైతన్న మొగ్గు

- రికార్డు స్థాయిలో వరి నాట్లు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చివరి వరకు నీరందడం కష్టమే!

మెదక్, మార్చి 10: వేసవి ముంచుకొస్తున్నది.. మార్చి మొదటివారం నుంచే ఎండలు దంచుతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. బోర్లు సరిపడా నీరు పోయడం లేదు. ఈ యాసంగి పంటలను కాపాడుకోవడం అన్నదాతకు తలకుమించిన భారమే అయ్యేలా కనిపిస్తున్నది.

2.60 లక్షల ఎకరాల్లో వరి

మెతుకు సీమలో రైతులు యాసంగి సీజన్‌లోనూ వరి సాగుకే మొగ్గు చూపారు. వ్యవసాయాధికారులు ఎంతగా హెచ్చరించినా ప్రత్యామ్నాయ పంటల పట్ల విముఖత చూపారు. మెదక్ జిల్లావ్యాప్తంగా అన్నిరకాల పంటలు 22,73,507 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తుండగా.. ఇందులో 2,60,000 ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. జిల్లాలో రైతులు ప్రధానంగా భూగర్భ జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఆరుతడి పంటల మాదిరి కాకుండా వరికి సమృద్ధి నీరుండాలి. సీజన్ ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతుండడంతో బోర్లు, బావుల్లో నీటిమట్టాలు అడుగంటుతున్నాయి. వరిసాగు చేస్తున్న రైతులు రానున్న రోజులను ఎలా అధిగమించాలోనని మదనపడుతున్నారు.

ఆలస్యంగా నాట్లు

ఈ యాసంగిలో రైతులు ఆలస్యంగా వరి నాట్లు వేశారు. సాధారణంగా అక్టోబరు నెలలో నారుమళ్లు పోసుకుని.. డిసెంబరు నెలాఖరుకు నాట్లు పూర్తిచేస్తారు. కానీ ఈసారి ఎన్నికల సందడి కారణంగా వ్యవసాయ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఘనపురం ప్రాజెక్ట్ ఆయకట్టు ప్రాంతమైన కొల్చారం, మెదక్, హవేళీఘనాపూర్, పాపన్నపేట మండలాల్లో సుమరు 25 వేల ఎకరాల్లో వరి పొలాలకు కాల్వల ద్వారా పంటలకు నీరందిస్తున్నారు. మిగతా మండలాల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

పడిపోతున్న జలమట్టాలు

ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండడంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. వానాకాలం సీజన్ మాదిరిగానే జిల్లాలో వరి సాగు పెరిగిపోవడం, దానికి తోడు బోరుబావుల నుంచి పంటపొలాలకు సరిపడా నీరందడం లేదు. వరికి నీరందించడం కారణంగా గత రెండు నెలల వ్యవధిలోనే బోరు బావుల్లో నీటిమట్టాలు తగ్గిపోయినట్లు జియాలజిస్టులు చెబుతున్నారు. జిల్లాలో 60 వేల వ్యవసాయ బోర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా మరో 30 వేలు ఉంటాయని అంచనా. జనవరి మాసంలో జిల్లా సగటు జలమట్టాలు 11 మీటర్లు కాగా ఫిబ్రవరిలో 13 మీటర్ల లోతుకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎండలు రోజురోజుకూ తీవ్రమవుతుండడంతో జలమట్టాలు మరింతగా తగ్గిపోయే సూచనలున్నాయని భూగర్భ జలశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం హావేళీఘనాపూర్, మెదక్, చిన్న శంకరంపేట, అల్లాదుర్గం, పెద్ద శంకరం పేట, రేగోడ్, రామాయంపేట, నార్సింగి మండలాల్లో పంటలకు నీరందడం లేదు. రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.



నార్సింగి మండలం నర్సంపల్లిలో నెర్రెలు వారుతున్న వరి పొలం



కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రాంగణంలో పట్నం వేయిస్తున్న భక్తులు

కొమురెల్లి క్షేత్రం..

భక్తిపారవశ్యం

- ఎనిమిదో వారం మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- హోరెత్తిన మల్లన్న నామస్మరణ.. దర్శనానికి మూడు గంటలు

7లో

కమనీయం

కేతకీలో కనుల పండువగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణ అలంకరణలో కేతకీ సంగమేశ్వర స్వామి, అమ్మవారు

7లో

కబ్జా కోరల్లో పాఠశాల స్థలం

- రూ.4 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- ధరణిలో నలుగురి పేర మార్పులు
- పట్టాపాస్ బుక్కులు జారీచేసిన అధికారులు

సంగారెడ్డి రూరల్, మార్చి 10 : నాలుగు కోట్ల విలువ చేసే ప్రభుత్వ పాఠశాల స్థలం అన్యాక్రాంతమయింది. ధరణి రాకముందు వరకు పాఠశాల పేరిట ఉన్న భూమి.. 2018లో ధరణి రికార్డుల్లో నలుగురు వ్యక్తుల పేరిట మారిపోయింది. పట్టాదారు పాస్‌బుక్కులు సైతం వచ్చాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో జరిగిన ఈ వ్యవహారంలో ఓ స్థానిక నాయకుడి ప్రమేయం ఉందనే ఆరోపణలున్నాయి.

ఫసల్‌వాది గ్రామంలోని సర్వే నంబర్ 673-1లో 3.15 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 2.04 ఎకరాల స్థలాన్ని 1958-60 సంవత్సరంలో గ్రామానికి చెందిన సజ్జద్ అలీఖాన్ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో కొంతభాగంలో స్కూల్ భవనాలు నిర్మించి, వెనుకభాగంలో ఆటస్థలం కోసం వదిలేశారు. ఈ భూమిని 1975 జులై 9న స్కూల్ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇచ్చారు. అప్పటి నుంచి 2018 వరకు రికార్డుల్లో ఆ స్థలం స్కూల్ పేరిటే ఉండేది. కానీ ధరణి పోర్టల్ వచ్చిన తరువాత పాఠశాల వెనుక ఉన్న ఖాళీ స్థలం నలుగురు వ్యక్తుల పేరిట మారిపోయింది. గ్రామానికి చెందిన నలుగురు చింతలపల్లి సంతోష్‌కుమార్ పేరిట 3 గుంటలు, గులామ్ ముస్తఫాఖాన్ పేరిట 20 గుంటలు, గులామ్ దావత్‌ఖాన్ పేరిట 6.50 గుంటలు, గులామ్ రియాజ్‌ఖాన్ పేరిట 6.50 గుంటలు ధరణి రికార్డుల్లో మారింది. వారి పేరిట పాస్‌బుక్కులు వచ్చాయి. రైతుబంధు కూడా పొందుతున్నారు. ఈ స్థలానికి రెవెన్యూ అధికారులు పాస్‌బుక్కులు జారీ చేయడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఈ వ్యవహారమంతా స్థానిక నాయకుడి ప్రమేయంతోనే జరిగిందనే ఆరోపణలున్నాయి.





ఫసల్‌వాదిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్కూల్ పక్కనే ఉన్న స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ



చుట్టూ ప్రహరీ నిర్మించి చదును చేసిన పాఠశాల స్థలం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఫసల్‌వాదిలోని జడ్పీహెచ్‌ఎస్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా పనిచేసిన దిగ్వాల్ రాములు పాఠశాల స్థలం అన్యాక్రాంతం కావడంపై 2018 సంవత్సరంలో అప్పటి డీఈవో, ఎంఈవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. మండల రెవెన్యూ అధికారులు రావడం సర్వే చేయడం వెళ్లిపోవడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు.

ధరణితోనే ఆక్రమణలు



ధరణి రాకముందు వరకు వరకు ఈ స్థలం రికార్డుల్లో పాఠశాల పేరిటే ఉంది. 2018లో ధరణి రికార్డుల్లో నలుగురి పేర్లపైకి మారిపోయింది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా సర్వే చేసి వెళ్తున్నారే కానీ పాఠశాల స్థలానికి హద్దులు చూపడం లేదు. స్థానిక నాయకుడి ప్రమేయంతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి పాఠశాల స్థలాన్ని స్కూల్‌కి అప్పగించాలి.

-జూలకంటి రాములు, ఫసల్‌వాది

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

స్కూల్ స్థలం విషయం మా దృష్టికి వచ్చింది. కొత్తగా విధుల్లో చేరినందున త్వరలోనే రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి స్కూల్ ప్రదేశాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. పాఠశాల స్థలమేనని తేలితే స్కూల్‌కి అప్పగిస్తాం.

-దేవిదాస్, తహసీల్దార్, సంగారెడ్డి

పదో తరగతి పిల్లలకు స్నాక్స్ లేవ్!

- గత నెల డబ్బులిస్తామన్న అధికారులు
- తర్వాత అర్ధాంతరంగా నిర్ణయం వెనక్కి
- దాతలు ముందుకు రాక అర్ధాకలి చదువులు


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 10 : పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే స్పెషల్‌క్లాసుల్లో స్నాక్స్ ఇచ్చేందుకు ప్రతి ఏటా నిధుల కోసం అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొన్నది. దాతల సహకారంతో స్నాక్స్ ఇవ్వాలంటూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలా ఉండగా గత నెల 7 వ తేదీన 'అర్ధాకలి చదువులు- దాతల కోసం ఎదురుచూపులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సంగారెడ్డి జిల్లాలో కథనం ప్రచురితమైంది. ఆ సమయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పందించారు. పదో తరగతి విద్యార్థుల స్నాక్స్ నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున 28 రోజులకుగాను రూ.28,68,000 నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు జిల్లా విద్యాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం ప్రారంభించాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ఆదేశాలు జారీ చేశారు. తర్వాత ఏమైందో ఏమో కానీ ఆ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు.

అధికారుల తీరుపై విస్మయం

విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పాఠశాలకు వచ్చి సాయంత్రం 5.45 గంటలకు వెళుతున్నారు. జిల్లాలోని 239 ఉన్నత పాఠశాలల్లో 11,008 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్పెషల్‌క్లాసులకు హాజరువుతున్నారు. స్నాక్స్ కోసం జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో సీఎస్ఆర్ నిధులు ఇస్తామని జిల్లా యంత్రాంగం హామీ ఇవ్వగా, తర్వాత ఎవరూ ముందుకు రాలేరని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. దీంతో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వడం నిలిచిపోయింది. ఈ విషయం కొన్ని ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియడంతో వారు స్నాక్స్ ఇవ్వడం ఆపేశారు. మరికొన్ని పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి సమాచారం అధికారికంగా వెళ్లకపోవడంతో స్నాక్స్ కంటిన్యూగా ఇస్తున్నారు. కొన్నిచోట్ల సొంతంగా డబ్బు వెచ్చించి స్నాక్స్ ఇస్తుండడం గమనార్హం. సమాచారం అందని చాలా మంది ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నిరోజులు పిల్లలకు స్నాక్స్ ఇచ్చిన డబ్బు ఎవరిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. మరో వారం రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిధుల విషయంలో వెనక్కి తగ్గడం పట్ల ఇటు జిల్లా యంత్రాంగం, అటు జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది.

కరాటే, కుంగ్‌ఫూ విజేతలకు బహుమతుల ప్రదానం


ట్రోఫీని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి

మనోహరాబాద్, మార్చి 10 : మండల కేంద్రంలో నిర్వహించిన కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు బహుమతులను ప్రదానం చేశారు. మనోహరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాస్టర్‌లు సాయి, సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బ్లాక్‌బెల్ట్‌లను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో పోలీసు బలగాల కవాతు

తూప్రాన్, మార్చి 10: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు ఎస్పీ డాక్టర్ బాలస్వామి ఆదేశాల మేరకు తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ పట్టణంలో వివిధ దళాలకు చెందిన పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) నిర్వహించారు. తూప్రాన్ పోలీస్‌స్టేషన్ నుంచి పాత హైవే మీదుగా నర్సాపూర్ చౌరస్తా వరకు కవాతు చేపట్టారు. ఇందులో తూప్రాన్ ఎస్‌ఐ శివానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత కొలువుదీరనున్న పాలకవర్గం

● జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్, మార్చి 10 : జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక ఐదేళ్లు కావస్తుంది. 2019 నుంచి ఇప్పటివరకు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గమంటూ లేకుండాపోయింది. బీఆర్ఎస్ హయాంలో పాలకవర్గంలో ఏర్పాటు విషయంలో వివిధ కారణాలతో జాప్యం చేశారు. ఐదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాలకవర్గం ఏర్పాటుకు సోమవారం ముహూర్తం ఖరారు చేశారు. చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్‌ను, ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డిని ఎంపిక చేశారు. వీరితో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

కొమురెల్లి క్షేత్రం.. భక్తిపారవశ్యం

● ఎనిమిదోవారం హోరెత్తిన మల్లన్న నామస్మరణ.. దర్శనానికి మూడు గంటలు

కొమురవెల్లి, మార్చి 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిదోవారం జాతరకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. భక్తులు తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో స్నానమాచరించారు. మల్లన్నకు బోనం నివేదించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం మల్లన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఎల్లమ్మతల్లికి బెల్లం పానకం, కల్లుసాక పోసి, బోనం నివేదించారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆలయ ఈవో బాలాజీ శర్మ, ఆలయ సూపరింటెండెంట్లు నీల శేఖర్, బుద్ధి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మల్లన్నను జిల్లా అడిషనల్ డీసీపీ (లా ఆర్డర్) మల్లారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయ ముఖమండపంలో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కమనీయం

కేతకీలో అంగరంగవైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కేతకీ సంగమేశ్వరాలయంలో నిర్వహిస్తున్న పార్వతీపరమేశ్వర్ల కల్యాణం, మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు



ఝరాసంగం, మార్చి 10 : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదామంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకిచేందుకు కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి కట్నకానుకలను సమర్పించుకున్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం ఆలయంలోని స్వామివారికి అభిషేక కార్యక్రమాలతో పాటుగా ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రుడి వేషాధారణలో దండకాల మధ్య బసవన్న మందిరం వరకు పల్లకీసేవను నిర్వహించారు. ఇక్కడ చేపట్టిన అగ్నిగుండప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, నేతలు హనుమంతురావు పాటిల్, ఉమాకాంత్‌పాటిల్, ఉదయ్‌శంకర్‌పాటిల్, వెంకటేషం, మాజీ ఆలయ చైర్మన్ వెంకటేషంగుప్తా, ఆలయ సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయంలో అమావాస్య పూజలు

కేతకీ సంగమేశ్వరాలయంలో అమావాస్య పూజలను నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండడంతో మూడు రోజుల నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడుతున్నది. ఆదివారం భక్తులు ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ ఆవరణలోని నవగ్రహాలకు తైలం, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని మండపంలో అభిషేక కార్యక్రమాలను చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది, ఆలయాధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టారు. జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. మండల పరిధిలోని మాచునూర్ శివారులోని రామేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు పూజలు చేశారు. కుప్పానగర్, చీలపల్లి గ్రామ శివారులోని మల్లయ్యగిరి గుట్టపై వెలిసిన మల్లికార్జునస్వామికి భక్తులు మొక్కులు చెల్లించారు.





స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, పల్లకీసేవలో దండకం వేస్తున్న బాలిక

ఘనంగా భద్రప్పస్వామి జాతర



ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎడ్లబండ్లు

కల్హేర్, మార్చి 10 : కల్హేర్‌లోని భద్రప్పస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. భద్రప్పస్వామి, శివాలయం, ఆంజనేయ, పోలేరమ్మ ఆలయాల చుట్టూ భక్తులు ఎడ్లబండ్లను తిప్పి మొక్కులను చెల్లించుకున్నారు.

వైభవంగా మహాదేవుని గుట్ట జాతర

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 10 : సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి గ్రామ శివారులోని మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న మహాదేవుని గుట్ట జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని రథం లాగారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రాంసింగ్, సిర్గాపూర్ ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రావ్ పాటిల్, గోసాయిపల్లి మాజీ సర్పంచ్ సాయాగౌడ్, నాయకులు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

1008 సామూహిక నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించనున్న నాగదేవతా విగ్రహాలు



జహీరాబాద్, మార్చి 10 : జహీరాబాద్ పట్టణంలోని కైలాసగిరి శివాలయం వద్ద సోమవారం 1008 నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉమ్మడి మెదక్‌జిల్లాలోనే ఎక్కడ ఇలాంటి ఆలయం లేదని వారు పేర్కొన్నారు. నాగదేవత ఆలయంలో 11, 12, 13న విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వెంకటఖ్వాజా దర్గాలో దీపకాంతులు

● రెండోరోజు వైభవంగా ఉర్సు ● గంధం సమర్పించిన ఎంపీ బీబీ పాటిల్



దర్గాలో మహిళలు వెలిగిస్తున్న దీపాలు

వట్‌పల్లి, మార్చి 10 : వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా 39వ ఉర్సు ఉత్సవాలు రెండోరోజు వైభవంగా కొనసాగాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులను చెల్లించుకున్నారు. దర్గా ఆవరణంలో భక్తులు లక్షా 11 వేల దీపాలను వెలిగించారు. దీంతో దర్గా ప్రాంగణమంతా దీపాలతో మెరిసిపోయింది. దర్గా ఆరాధన ఉత్సవాలకు జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ హాజరై గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి ముకుందరావు చిస్తీ ప్రసాదం అందజేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ అనంతరావు కులకర్ణి, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు వడ్ల నాగేష్, అనిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

పెద్దచెరువు మత్తడి రాళ్లను తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు



నీళ్లు దిగవకు వెళ్లకుండా ఇసుక సంచులతో మూసివేస్తున్న రైతులు

నారాయణరావుపేట, మార్చి 10 : సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలోని పెద్దచెరువు మత్తడి రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ద్వారా చెరువుల్లోకి నీళ్లు నింపుతుండగా ఈ క్రమంలోనే ప్రాజెక్ట్ నీటితో పెద్దచెరువు నిండింది. మత్తడి లేవల్‌కు రాకముందే శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చెరువు పెద్దమత్తడిపై సుమారు మూడు మీటర్ల పొడవు రెండు వరుసల మత్తడి కట్టురాళ్లను తొలగించారు. ఆదివారం ఉదయం గ్రామ రైతులతో పాటు చెరువు కింది పక్క గ్రామాల రైతులు పెద్దచెరువు వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు, సిద్దిపేట రూరల్ పోలీసులు వచ్చి రైతులకు సర్దిచెప్పారు. రాళ్లు తొలగించిన ప్రదేశాన్ని ఇసక సంచులతో మూసివేసి నీటిని కట్టడి చేయించారు. ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా చట్టవిరుద్ధమైన పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏఈ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఈ విషయమై సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రామాయంపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు

● పాల్గొన్న 170 మంది క్రీడాకారులు



జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

రామాయంపేట, మార్చి 10 : రామాయంపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఛాంపియన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. దీనిలో 17 జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 16, 17 విభాగాల్లో బాలబాలికలు, అండర్ 19, 23 క్రీడాకారులు మౌంటెన్ బైక్ రేస్‌లో పాల్గొన్నారు. మెదక్ రూట్‌లోని బ్రిడ్జి వద్ద సైక్లింగ్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. గుట్టల మీదుగా రెండు గంటల పాటు క్రీడాకారులు పోటీతత్వంతో సైకిల్ తొక్కారు. ప్రతిభ కనబరిచిన 76 మంది క్రీడాకారులకు సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు షీల్డ్‌లు, మెడల్‌లు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 28వ తేదీన హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. కాగా ముగింపుసభలో సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు విజయ్‌కాంత్, మనోహర్, రవికుమార్, జానకీరాంతో పాటు సైక్లింగ్ కోచ్ దండు యాదగిరి, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



ఏడుపాయల ఆలయ పరిసరాల్లో గుడారాలు



రథం ఎదుట పట్నం వేస్తున్న దృశ్యం

జనసంద్రం

మూడో రోజు ఏడుపాయల జనసంద్రమైంది. ఆదివారం రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.

- పాపన్నపేట



ఆలయం వద్ద భక్తజనం



విశేష అలంకరణలో వనదుర్గామాత


కొత్లాపూర్‌లోని జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల విద్యార్థినులతో బీడీఎల్ ఓబీసీ అసోసియేషన్ సభ్యులు


హత్నూర: గుండ్లమాచునూర్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో మహిళలను సన్మానిస్తున్న ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 10: మహిళల విద్యాభివృద్ధికి కృషిచేసిన వీరవనిత సావిత్రిబాయి పూలే అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం సంగారెడ్డిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు పోరాడిన నాయకురాలు గొప్ప రచయిత్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్, హరీష్‌గౌడ్, కుమార్‌గౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, అనంతయ్య, కొండాపురం జగన్, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పూలబాయి, ఉపాధ్యాయురాలు ప్రశాంతి, ఎంపీటీసీ జ్యోతి పాల్గొన్నారు.

●**హత్నూర:** హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచనూర్ గ్రామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆలిండియా సమత సైనిక్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రాజ్, గ్రామ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణ, రాజు, విక్రమ్, ప్రమోద్, సురేష్, రాము పాల్గొన్నారు.

●**సంగారెడ్డి రూరల్:** సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా బీడీఎల్ ఓబీసీ అసోసియేషన్ సభ్యులు సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలోని జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో విద్యార్థినులకు డిక్షనరీ, నోట్ బుక్‌లు, గ్రామర్ బుక్‌లు, ఇడ్లీ కుక్కర్, ఫ్రిడ్జ్, మిక్సీలతో పాటు ఆటవస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సాయిబాబు, సంతోష్‌కుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

●**నిజాంపేట:** మహిళా హక్కుల ఉద్యమ కెరటం సావిత్రిబాయి పూలే అని డీబీఎఫ్ నాయకులు సంజీవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


నిజాంపేట: సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

సమాచారం

అల్లాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి, మార్చి 10: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకరయ్య ఆదివారం ప్రారంభించారు.

13 నుంచి హనుమాన్ దీక్షలు

నారాయణఖేడ్, మార్చి 10: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని 13న హనుమాన్ దీక్షలను స్వీకరించే వారు కొండాపూర్ హనుమాన్ ఆలయం ఆవరణలో పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆధ్వర్యంలో దీక్షలను స్వీకరించాలని కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఉదయం 6 గంటల వరకు ఆశ్రమానికి చేరుకోవాలన్నారు.

బీజేపీ బూత్‌స్థాయి సమావేశం

నాగల్‌గిద్ద, మార్చి 10: బీజేపీ నాగల్‌గిద్ద బూత్‌స్థాయి సమావేశాన్ని మండలంలో ఎస్సీ మోర్చా అసెంబ్లీ అధ్యక్షుడు సుధాకర్, బీజేపీ మండలాధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ఆర్థిక సహాయం అందజేత

చిన్నశంకరంపేట, మార్చి 10: మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన భిక్షపతి కొన్నిరోజులు క్రితం ఆర్థిక ఇబ్బందులతో మృతిచెందాడు. ఆ కుటుంబానికి తోటి పూర్వ విద్యార్థులు రూ.40 వేలను భిక్షపతి కూతురు నీలిమ పేరిట పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. సంతోష్‌గౌడ్, పృథ్వీరాజ్, నరేష్, శ్రీమాన్, రమేష్, ప్రవీణ్, నరేష్, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

మాసాయిపేట, మార్చి 10: మండల కేంద్రమైన మాసాయిపేటలో అనారోగ్యంతో మృతిచెందిన అప్పర్ కుటుంబానికి, లింగారెడ్డిపల్లిలో ఇల్లు దగ్ధమైన బాధితురాలు సుంచు లక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ ఎంపీటీసీ వీరన్నగారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు.

సోమేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● **మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు**

చిన్నశంకరంపేట, మార్చి 10: సోమేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరావు, తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని సోమేశ్వరస్వామి జాతరలో భాగంగా ఎమ్మెల్యేలు పాల్గొని స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారికి మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మనోజ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నశంకరంపేట సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

కాగా ఆదివారం రాత్రి సోమేశ్వరస్వామి, గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సతీమణి వాణి స్వామివారికి మొక్కులు తీర్చుకుని అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు.

మానవ జీవన వృక్షానికి బాల్యమే మూలాధారం

● **ప్రముఖ సైకాలజిస్ట్ సోనాల్ రవి అండ్రూస్**
● **సిద్ధార్థ్ విద్యాసంస్థల్లో ఘనంగా గ్రాడ్యువేషన్ డే**
● **సోచ్ సంస్థకు రూ.7.77 లక్షల విరాళం అందజేత**

మెదక్ అర్బన్, మార్చి 10: మానవ జీవన వృక్షానికి బాల్యమే మూలాధారమని ప్రముఖ సైకాలజిస్ట్ సోనాల్ రవి అండ్రూస్ పేర్కొన్నారు. సిద్ధార్థ్ విద్యాసంస్థల్లో ఆదివారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులు, యాజమాన్యం కలిసి సోచ్ స్వచ్ఛంద సంస్థకు రూ.7,77,777లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇట్రోడ్ సంస్థ నిర్వాహకులు మధుకర్‌రెడ్డి, బుక్ పబ్లిషర్స్ సాయికృష్ణ, ప్రిన్సిపల్ సంధ్యారాణి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పట్టాలు పొందిన విద్యార్థులతో సోనాల్ రవి అండ్రూస్, స్కూల్ యాజమాన్యం

ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

● **తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి**

జహీరాబాద్, మార్చి 10: ఈనెల 12న జరిగే మంత్రివర్గ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు మంజూరు చేయాలని తపస్ జిల్లా (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) అధ్యక్షుడు దత్తాత్రి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిరంలో జహీరాబాద్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్ యూనియన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడునెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు దశరత్, తుక్కప్ప, శ్రీపాల్, విజయ్, క్రిష్ణ, యాదయ్య, ఈశ్వర్, శివరాజ్, నరేందర్, శేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి

తాగునీటి కోసం మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నిజాంపేట, మార్చి 10: తాగునీటి సమస్య తీర్చాలంటూ మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గల ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మూడునెలల నుంచి బోరు మోటార్ నీళ్లు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు స్పందించి కాలనీలో నీటి సమస్యను కల్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బూదవ్వ, వాణి, వినోద, ఎల్లవ్వ, బాలరాజవ్వ పాల్గొన్నారు.

జీరో బిల్లుల పత్రాలు అందజేత


లబ్ధిదారులకు జీరో బిల్లుల పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి సంబంధించి 200 యూనిట్‌లోపు ఉచిత కరెంట్ బిల్లుల స్లిప్పులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం అన్నివర్గాలకు న్యాయం చేకూరేలా పథకాలు అందజేస్తున్నదని చెప్పారు. గృహజ్యోతికి సంబంధించి ఎవరికైనా ఉచిత కరెంట్ (జీరో బిల్) రాని వారు ఉంటే ఆందోళన చెందకుండా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

నేడు తైబజార్ వేలం

నర్సాపూర్, మార్చి 10: నర్సాపూర్ పట్టణంలో నిర్వహించే వివిధ మార్కెట్లకు తైబజార్ వేలం నేడు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జైతురాంనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ వేలం పాటకు ఆసక్తిగల వారు సకాలంలో హాజరై పాల్గొనవచ్చన్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత, కబేళాలకు వేలం వేయనున్నట్లు చెప్పారు.

సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి

అక్బర్‌పేట- భూంపల్లి, మార్చి10: ఓ వ్యక్తి సైకిల్ మీద నుంచి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన ఎనగుర్తి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన డాకుల స్వామి(54) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామంలోని హోటల్ వద్ద టీ తాగేందుకు వెళ్లిన డాకుల స్వామి సైకిల్ మీద నుంచి దిగుతుండగా జారి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాయపోల్, మార్చి 10: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనమండలంలోని కృష్ణసాగర్‌లో చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణసాగర్ గ్రామానికి చెందిన కొప్పుల సుశీల(55) కిడ్నీలు దెబ్బతినడంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. మళ్లీ ఇటీవల జారిపడడంతో ఆమె కాలు విరిగింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమె కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ల సూచనల మేరకు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కొడుకు కొప్పుల అంజనేయులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి గల్లంతు

నర్సాపూర్, మార్చి 10: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని చెరువులో పడి వ్యక్తి గల్లంతయ్యాడు. పెద్దచింతకుంటకు చెందిన ముద్దంబాలేష్(45) గేదెలను కాయడానికి వెళ్లాడు. సాయంత్రం చెరువులో వాటికి నీటిని తాపించేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యాడు. ఈ విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ పుష్పరాజ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. పొద్దుపోయే వరకు కూడా గాలింపు చేపట్టినా లభించకపోవడంతో చీకటి పడటంతో తిరిగి సోమవారం గాలింపు చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

కాళ్లకల్‌లో వివాహిత అదృశ్యం


సూర్యవంశీ (ఫైల్)

మనోహరాబాద్, మార్చి 10: వివాహిత అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మెహిదీపట్నం ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ యాసిన్‌షేక్.. మహారాష్ట్ర నాగపూర్ గడ్డి గోదాం రైల్వే క్వార్టర్స్‌కు చెందిన దీస్‌మల్ల సూర్యవంశీ(32)ని ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. బతుకుదెరువు కోసం 8 నెలల క్రితం కాళ్లకల్‌కు వచ్చి ముప్పిరెడ్డిపల్లి చాక్‌లెట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 3న యాసిన్‌షేక్ డ్యూటీకి వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి రాగా భార్య కనిపించలేదు. అప్పటి నుంచి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యాసిన్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి ప్రసాద్


కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, మార్చి 10: దివంగత మాజీ సర్పంచ్ జిన్నారం పెద్దగొని ప్రసాద్ అహర్నిశలు పేదల అభ్యున్నతికి పాటుపడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సోదరుడు జిన్నారం పెద్దగొని శివకుమార్‌గౌడ్ అన్నారు. దివంగత మాజీ సర్పంచ్ జిన్నారం ప్రసాద్ 20వ వర్ధంతి సందర్భంగా శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శివ్వంపేట మండలం గూడూర్ గ్రామంలో ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి వర్ధంతి నిర్వహించారు. అనంతరం వందమంది పేదలకు బట్టలను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వితంతువు వంజరి రేఖకు కుట్టు మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సోదరుడు సూర్యకుమార్‌గౌడ్, ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి, నాయకులు రమణాగౌడ్, మైసయ్య యాదవ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం


ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించిన టీబేస్ నాయకులు

జహీరాబాద్, మార్చి 10: వివిధ ప్రభుత్వశాఖల్లో ఇటీవల ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు టీబేస్ రాష్ట్ర నాయకుడు తులసీరాంరాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో రవీందర్‌భానోత్(ఉపాధ్యాయుడు), చంద్రకళ(ఉపాధ్యాయురాలు), లలిత(స్టాఫ్‌నర్స్), సునీల్(నర్సింగ్ స్టాఫ్), ధనుభాయి(ఉపాధ్యాయురాలు), జైపాల్(ఉపాధ్యాయుడు), సుధారాణి(జూనియర్ లెక్చరర్), జ్యోతి(నర్సింగ్‌స్టాఫ్)లు ఉన్నారు.

నేడు మండల సర్వసభ సమావేశం

● **సమావేశానికి అధికారులు హాజరయ్యేనా?**

కొండాపూర్, మార్చి 10: నేడు జరుగనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ హాజరయ్యేనా అనే ప్రశ్న సభ్యులకు కలుగుతున్నది. మూడునెలలకోసారి ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి పూర్తిస్థాయి అధికారులు రావడం లేదు. దీనిపై సభ్యులు వాకౌట్ చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా అధికారుల్లో స్పందన రావడం లేదనే విమర్శలున్నాయి. ఐదేళ్ల నుంచి సమావేశాలు జరుపుతున్నా.. పూర్తిస్థాయి అధికారులు రాకపోవడంతో సంక్షేమం, అభివృద్ధి పనులు, సమస్యలు పరిష్కరించని ప్రజాప్రతినిధులుగా నిందలు ఎదుర్కొంటున్నామని సభ్యులు పేర్కొంటున్నారు. అయితే నేడు జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ హాజరుకావాలని సభ్యులు కోరుకుంటున్నారు.

డ్రైనేజీ నిర్మాణంలో వసూళ్ల పర్వం

చేర్యాల, మార్చి 10: పట్టణంలో కొనసాగుతున్న జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టు సూపర్‌వైజర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కన భవనాల యజమానుల నుంచి వసూళ్లకు పాల్పడుతుండడం వివాదస్పదమవుతున్నది. నిబంధనల ప్రకారం రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 45 ఫీట్ల దూరంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, కొద్దిమంది దుకాణ భవన యజమానులు ముందు భాగంలో కొంతమేర స్థలాన్ని కోల్పోవాల్సి రావడంతో, అలా నష్టపోకుండా నిర్మాణం చేపట్టాలని ఆందోళనలు చేపట్టారు. ఈ విషయాన్ని ఆసరా చేసుకున్న సూపర్‌వైజర్ సదరు యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. అడిగినన్ని డబ్బులు ఇస్తే పనులు పూర్తి చేయిస్తున్నాడు.

రూ.5 వేలకు బేరం, రూ.2వేలు ముందస్తు వసూలు

ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. ఓ దుకాణాదారుడు అడిగినన్ని డబ్బులు ఇవ్వడంతో 13.5 మీటర్లకు కాలువ చేపట్టడంతో పాటు పునాదిరాళ్లను వారి సిబ్బందే పక్కన భద్రపరిచారు. ఓ వ్యక్తి కేవలం నాలుగు ఇంచుల స్థలం విడిచిపెట్టి గోతి తీయాలని కోరినందుకు సూపర్‌వైజర్ రూ.5వేలు ఇవ్వాలనడంతో కాంప్లెక్స్ యాజమాని షాదుల్లా రూ.2వేలు ముందస్తుగా చెల్లించి, మిగతా రూ.3వేలు పని పూర్తిచేశాక ఇస్తానని చెప్పినా కూల్చివేతకు ప్రయత్నించడంతో పనులు అడ్డుకుని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాడు.


సమస్యలను పట్టించుకోనందుకే అవిశ్వాస తీర్మానం

● **మున్సిపల్ కౌన్సిలర్ నక్క మంజులతానాగరాజుగౌడ్**

సంగారెడ్డి రూరల్, మార్చి 10: గ్రేడ్‌వన్ మున్సిపాలిటీగా పేరున్న సంగారెడ్డి మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా సమస్యలను పట్టించుకోనందుకే చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టామని 27వ వార్డు కౌన్సిలర్ నక్క మంజులతానాగరాజుగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవిశ్వాస తీర్మానంలో వివిధ పార్టీలకు చెందిన 24 మంది కౌన్సిలర్లు సంతకాలు పెట్టారన్నారు. తమకు 22 మంది సభ్యులు మద్దతుగా నిలిచారని, బీఆర్ఎస్ సభ్యులు ప్రత్యక్షంగా 15 మంది మద్దతు తెలపగా.. ఏడుగురు ఇతర పార్టీ సభ్యులు పరోక్షంగా మద్దతుగా నిలిచారన్నారు. కానీ మా పార్టీకి చెందిన కొందరు సభ్యులు వారి స్వప్రయోజనాలకు అవిశ్వాసానికి దూరంగా ఉండడం వల్ల అవిశ్వాసం వీగిపోయిందని పేర్కొన్నారు. తమకు చైర్‌పర్సన్‌పైన కానీ, వేరేవారి పైన కానీ వ్యక్తిగత విబేధాలు లేవని, 24 మంది సభ్యులు కలిసి చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలను భరించలేక, సంగారెడ్డి అభివృద్ధి కోసం ఆమెను గద్దెదించాలని కోరగా తాము ముందుకు వచ్చామని వివరించారు. తమకు మద్దతుగా నిలిచిన 22 మంది సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆమె తెలిపారు.

మంత్రి దామోదర్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

● **కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్ జోషి**


మంత్రి దామోదర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి, మార్చి 10: అందోల్ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో మంత్రి దామోదర్ రాజనర్సింహతోనే అభివృద్ధి సాధ్యమైందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌జోషి అన్నారు. ఆదివారం వట్‌పల్లిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. 90 రోజుల కాలంలోనే నియోజకవర్గానికి రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్రి అపర్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ జానయ్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నాఘన్‌పూర్‌లో దొంగల హల్‌చల్

● **తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీ** ● **నెలరోజుల్లో రెండో ఘటన**

కొల్చారం, మార్చి 10: కొల్చారం మండల పరిధిలోని చిన్నాఘన్‌పూర్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన బట్టిగారి బూదెమ్మ, వడ్డె ఎల్లయ్య, కమ్మరి విమల కుటుంబసభ్యులు శనివారం ఇంటికి తాళం వేసి ఏడుపాయల జాతరకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బూదెమ్మ ఇంట్లో రూ.30 వేలు, తులం బంగారు కమ్మలు, 20 తులాల వెండి పట్టగొలుసులు, వడ్డె ఎల్లయ్య ఇంట్లో అర తులం బంగారం, కిలో వెండి వస్తువులు, రూ.10 వేలు, ఎల్ఈడీ టీవీ, కమ్మరి విమల ఇంట్లో రూ.5 వేలు, కిలో కారంపొడి చోరీకి గురైంది. వడ్డె ఎల్లయ్య ఇంట్లో వారంరోజుల క్రితమే పెళ్లి జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉండగా నెలరోజుల క్రితం గ్రామానికి చెందిన వెంకటాపురం బాలయ్య, వడ్ల లక్ష్మీనారాయణ ఇళ్లలో దొంగతనం జరిగింది. నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు దొంగతనం జరగడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం చోరీ జరిగిన ఇళ్లలో క్లూస్ టీం సిబ్బంది పరిశీలించే ఆధారాలు సేకరించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపారు.


చిన్నాఘన్‌పూర్‌లో దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం అధికారులు

మద్దూరులో అసంపూర్తిగా క్రీడా ప్రాంగణాలు

మద్దూరు, మార్చి 10: యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేందుకు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం ఒక్కో క్రీడాప్రాంగణానికి వాలీబాల్ కిట్స్, క్రికెట్ కిట్స్, డంబుల్స్ క్రీడా దుస్తులను సరఫరా చేసింది.

పనులవైపు తొంగిచూడని అధికారులు

హడావుడిగా పనుల్ని ప్రారంభించిన అధికారులు బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. క్రీడాప్రాంగణాల కోసం తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరును సూచించే బోర్డు, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ పిట్, ఎక్సర్ సైజ్ బార్ వంటి పరికరాలను లక్షలాది రూపాయలు ఖర్చు చేయించి ప్రజాప్రతినిధులచే కొనుగోలు చేయించారు. క్రీడా ప్రాంగణం చుట్టూరా పచ్చదనం ఉట్టిపడేలా చెట్ల పెంపకం చేపట్టాలన్న ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఒక్కో గ్రామపంచాయతీ సుమారు రూ.45 వేల నుంచి 2 లక్షల చొప్పున సుమారు అన్ని గ్రామపంచాయతీలు కలిపి సుమారు రూ. 22 లక్షలపైనే ఖర్చు చేసినట్లు సమాచారం.